క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు:కానూరులో రూ.34 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు తాళ్ల నరేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గడపగడపలో పర్యటించిన సమయంలో స్థానికులు రోడ్డు నిర్మాణం చేయాలని కోరారన్నారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి మున్సిపాలిటీ నిధులు రూ.34 లక్షలు మంజూరు చేశారన్నారు. రంగా బొమ్మ నుంచి చర్చి వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వేమూరి బాలకృష్ణ, వెన్న ఏడుకొండలు, మనోజ్ పలువురు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వ్రతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక వ్రతం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయంలో 48 మంది దంపతులతో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వ్రతం నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న దంపతులకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ అరుణ దంపతులు పూజా సామగ్రిని ఉచితంగా అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు భక్తులతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

వరకట్నం వేధింపులపై కేసు

పెనమలూరు:వరకట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి బీజేఆర్‌నగర్‌కు చెందిన పరిమి సరళ 2021లో దావులూరుకు చెందిన పి.సాగర్‌ను కట్న కానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త తాపీ పని చేస్తాడు. వీరికి పిల్లలు లేరు. అయితే పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు చాలలేదని భర్త వేధించసాగాడు. పైగా మేనమామను వివాహం చేసుకోకుండా తనను ఎందుకు వివాహం చేసుకున్నావని అనుమానం వ్యక్తం చేస్తూ హింసిస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు

పెనమలూరు:గంగూరు గ్రామంలో యువతి అదృశ్యం అవ్వటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... చేపల కుండీల వద్ద భార్యాభర్తలు చల్ల దుర్గాదేవి, గురునాథ్ నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా పెద్ద కుమార్తె (18)ను ఇటీవల రేపల్లెకు చెందిన కోటమహేష్ అనే వ్యక్తి తీసుకెళ్లగా అక్కడ పోలీసులు బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. శనివారం కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా యువతి తలుపులు వేసి అదృశ్యమయింది. ఈ ఘటన పై యువతి తల్లి దుర్గాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ప్రజలకు జగనన్న సురక్ష

- గ్రామ స్థాయిలోనే ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు
- దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు సైతం పరిష్కారం
- 11 రకాల సేవలు ఉచితంగా అందటంతో ప్రజల్లో ఆనందం



ఈడుపుగల్లులో ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

కంకిపాడు: ఒకప్పుడు ఏ చిన్న సర్టిఫికెట్ కావాలన్నా మండల కేంద్రానికి పరుగులు తీయాల్సి వచ్చేది. సచివాలయాలు వచ్చాక, జగనన్న సురక్ష కార్యక్రమంలో గ్రామంలోనే సర్టిఫికెట్లను అందిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సేవలు ఇంత పారదర్శకంగా అందటం అభినందనీయం. వైఎస్సార్ చేయూత దరఖాస్తుకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు, సేవలు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్షతో ప్రజలకు మేలు చేకూరింది. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందాయి. ఇంటింటి సర్వే ద్వారా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన 11 రకాల సేవల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేసింది.

దీంతో గ్రామ గ్రామాన ప్రజలు ప్రభుత్వ పనితీరుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

12,683 ధ్రువీకరణ పత్రాలు జారీ....

మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో 356 క్లస్టర్లు ఉన్నాయి. వీటిలో ఆయా క్లస్టర్ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి నుంచి వచ్చిన వినతులను నమోదు చేసుకున్నారు. ఒక్కో గ్రామంలో వారం రోజులు పాటు ఇంటింటి సర్వే నిర్వహించి వినతులను ఆన్‌లైన్ చేశారు. జూలై 1 నుంచి 22వ తేదీ వరకూ అన్ని సచివాలయాల వారీగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. 23900 గృహాలకు గానూ 20621 గృహాల సందర్శన, సర్వే పూర్తి చేశారు. స్థానికంగా ఆయా కుటుంబీకులు అందుబాటులో లేని కారణంగా 3279 ఇళ్ల సర్వే చేయలేదు. 13439 వివరాలను ఆన్‌లైన్ చేసి టోకెన్‌లను జారీ చేశారు. 13272 సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల నుంచి అనుమతి రావటంతో ధ్రువీకరణ పత్రాలు 12683 లబ్దిదారులకు అందజేశారు. వీటిలో ఇంటిగ్రేటెడ్ ధ్రువీకరణ 5878, ఆదాయం 4486, వివాహం 3, మ్యూటేషన్ 1, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ (ఎఫ్ఎంసీ) 20, సీసీఆర్‌సీ 44, కొత్త రేషన్‌కార్డులు 16, సభ్యుల నమోదు 64, కార్డు వేరు 18, తొలగింపు 3, ఇతర సేవలు 22, ఇతరులు పొందిన ధ్రువీకరణ కులం 1238, ఆదాయం 890 జారీ చేశారు. ఇవి కాకుండా ఆధార్ అనుసంధానం 589 పూర్తి చేసి అన్ని పథకాలకు ఆధార్ ఇబ్బందులు లేకుండా పరిష్కరించారు.

జనానికి ఊరట.....

గతంలో సచివాలయాలు రాక ముందు ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా మండల కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. సచివాలయం వచ్చాక స్థానికంగానే సమస్యలపై అర్జీలు తీసుకుని పరిష్కరిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 11 రకాల సేవలు ఉచితంగా అందేలా చేయటంతో వేలాది మంది ప్రజలకు లబ్ధి చేకూరింది. అందులోనూ పాఠశాలలు, కళాశాలలు తెరిచే నెల కావటం, ప్రభుత్వ పథకాలకు అర్హత వచ్చిన వాళ్లు దరఖాస్తు చేసుకునేందుకు అన్ని రకాల ధ్రుకవీరణ పత్రాలను జారీ చేశారు. మండల కేంద్రానికి వెళ్లి కాళ్లరిగేలా తిరిగి విసిగి వేసారిపోయే పరిస్థితి తలెత్తకుండా గ్రామంలోనే అన్ని రకాల సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టి బాసటగా నిలిచింది. దీంతో ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఇన్నాళ్లకు కార్డు వచ్చింది



గతంలో రేషన్‌కార్డు మంజూరు కోసం అర్జీ పెట్టాను. అధికారుల చుట్టూ ఎన్నో సార్లు తిరిగాను. జగనన్న సురక్షతో వలంటీరు ఇంటికి వచ్చి సమస్య తెలుసుకుని అర్జీ పెట్టించారు. వెంటనే రేషన్‌కార్డు అందింది. చాలా ఆనందంగా ఉంది. సీఎం సార్ థాంక్యూ.

హసీనా, లబ్ధిదారురాలు, కంకిపాడు

మళ్లీ జగనే సీఎం కావాలి



గతంలో ప్రతి చిన్న పనికీ మండల కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. సచివాలయాలు, వలంటీరు వ్యవస్థ ద్వారా మాకు సమీపంలోనే కార్యాలయాలు ఏర్పడ్డాయి. ప్రతి అవసరాన్ని తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. మంచి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలి. అప్పుడే ప్రజలకు మంచి జరుగుతుంది. మరిన్ని పథకాల ద్వారా లబ్ధి పొందుతాం. ప్రభుత్వానికి అండగా నిలుస్తాం.

వి.సత్యనారాయణ, లబ్ధిదారుడు, కంకిపాడు

17,759 సర్టిఫికెట్లు జారీ



జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు జారీ చేస్తున్న కమిషనర్ ప్రకాశరావు (ఫైల్)

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. 19 వార్డు సచివాలయాల్లో నిర్వహించామన్నారు. జగనన్న సురక్ష సందర్భంగా ప్రతి ఇంటికి సర్వే నిర్వహించి సమస్యలు గుర్తించి నమోదు చేశామన్నారు. 11 రకాల సేవలు జగనన్న సురక్షలో అందించామని తెలిపారు. వివిధ రకాల ధ్రవపత్రాలు మొత్తం 17,759 సర్టిఫికెట్లు జారీ చేశామని వివరించారు. ఏ ప్రభుత్వ కార్యాలయంకు వెళ్లకుండానే ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహించిన గ్రామసభల్లో సర్టిఫికెట్లు ప్రజలకు అందచేశామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు భవిష్యత్తులో వచ్చే సమస్యలు ఉంటే వెంటనే ఆయా వార్డు సచివాలయాల్లో అధికారుల దృష్టికి తీసుకొస్తే సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తామన్నారు.

రైతులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే పార్థసారథి



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: అధిక వర్షాలకు నష్టపోయిన అన్నదాతలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని కడవకొల్లు, ముదునూరు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో నీటి ముంపునకు గురై దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి నిర్వహించి నష్టం వివరాలను సేకరించారు. ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులను వెంటనే మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి పంటలను కాపాడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు ముదునూరులో మురుగుకాలువ పూడిక పనులు ప్రారంభించారు. కడవకొల్లులో ప్రజలు కాలువ దాటేందుకు తూములు ఏర్పాటుచేసుకోవటంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందని రైతులు తెలపటంతో ఆ కాలువను పరిశీలించారు. నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. వరి నాట్లు దెబ్బతిన్న రైతులకు విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ దాసే రవి, ముదునూరు సర్పంచ్ మొవ్వా వెంకట నాగలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొల్లపూడి వేణు, కడవకొల్లు పీఏసీఎస్ చైర్మన్ జొన్నలగడ్డ నరేష్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దారు పి.జాహ్నవి రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ప్రజానీకం తమ సమస్యలను అధికారుల దృష్టికి అర్జీల రూపంలో అందజేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తహసీల్దారు విజ్ఞప్తి చేశారు.

ప్లాస్టిక్ నియంత్రణ సామాజిక బాధ్యత

ఉయ్యూరు: ప్లాస్టిక్ నియంత్రణ సామాజిక బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం జరిగింది. సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరావు నూతన కార్యవర్గం కొలసాని రవి, చేవూరి రవి సుధాకర్‌తో కూడిన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వల్లభనేని నాని మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రించే దిశగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. సీఐ పాలడుగు లక్ష్మి, ప్రతినిధులు తిరుమలశెట్టి వాసు, అనిల్‌కుమార్, మట్టా హానోక్, పినమాల నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఏసుపాదంకు వీల్‌చైర్ వితరణగా ఇచ్చారు.

నారాయణపురంలో బాలిక ఆకస్మిక మృతి



తేజస్విని ఫైల్



తేజస్విని మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి శివారు నారాయణపురంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆకస్మికంగా మృతి చెందటంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. అప్పటి వరకూ ఇంట్లో హుషారుగా ఆడుకున్న బాలిక శనివారం రాత్రి ఒక్కసారిగా కుప్పకూలిపోవటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. చదువులోనూ, ఆటపాటల్లోనూ ఎంతో చురుగ్గా ఉండే విద్యార్థిని మావులూరి తేజస్విని మరణం కుటుంబ సభ్యులతో పాటుగా గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. వివరాల్లోకి వెళ్లితే.. నారాయణపురంకు చెందిన మావులూరి విజయరాజు కుమార్తె తేజస్విని (13)కి మూడు రోజుల క్రితం నీరసంగా ఉండటంతో ఏలూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి కిడ్నీలో చిన్నరాయి ఏర్పడిందని, మందులు వాడితే తగ్గిపోతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో శనివారం పాఠశాలకు శెలవు కావటంతో ఇంట్లోనే ఉన్న తేజస్విని అకస్మాత్తుగా తల్లిదండ్రుల కళ్ల ఎదుటే ఒక్కసారిగా కుప్పకూలిపోవటంతో హుటాహుటిన చిన్నవుటపల్లిలోని పిన్నమనేని సిద్దార్థ వైద్యశాలకు తరలించారు. కానీ అప్పటికే బాలిక మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన వర్ణణాతీతంగా మారింది. ఆదివారం బంధువులు, గ్రామస్తులు, తోటి విద్యార్థుల అశ్రునయనాలతో తేజస్విని భౌతికకాయానికి నివాళి అర్పించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు తేజస్విని అంతిమయాత్రలో పాల్గొన్నారు.

స్కాయ్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రసాద్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కృష్ణాజిల్లా స్కాయ్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హనుమాన్ జంక్షన్‌కు చెందిన గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ వీడీఎస్ ప్రసాద్ ఎన్నికయ్యారు. స్థానిక టైగర్ పవర్ క్లబ్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా విద్యాధర్, ప్రధాన కార్యదర్శిగా వర్రె అంజిబాబు, సంయుక్త కార్యదర్శిగా జి.భరత్, కోశాధికారిగా జి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా కృపా సంగీత్, అన్నమయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గ్రామస్తుల సహకారంతో రోడ్డుకు మరమ్మతులు

ఉంగుటూరు: మండలంలోని గుడివాడ-విజయవాడ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలకు గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు ఆదివారం మరమ్మతులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. విజయవాడ-గుడివాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు నందమూరు నుంచి మానికొండ వరకు పెద్ద గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ గోగినేని వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నిమ్మకూరి స్వర్ణలత, వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, ఎంపీటీసీ ముత్తయ్య మరికొందరు గ్రామస్తులు తమ సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. దీంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.

పేదరిక నిర్మూలనే లయన్స్ ధ్యేయం

ఉయ్యూరు: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా లయన్స్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ 316 కెఎస్ శంకర్ గుప్తా అన్నారు. మానికొండ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శిగా నల్లా శ్రీనివాసరావు, కోశాధికారిగా ఊర కిషోర్‌కుమార్‌తో కూడిన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. నూతన కార్యవర్గానికి లయన్స్ జిల్లా గవర్నర్ గుప్తా బాధ్యతలు అప్పగించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవే పరమావధిగా నూతన కార్యవర్గం సేవలు అందించాలన్నారు. సమాజంలో పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు మిరియాల వెంకటేశ్వరరావు, గద్దె శేషగిరిరావు, నూకల వెంకట సాంబశివరావు, వేమూరి సత్యనారాయణ, ఆంజనేయులు, రామసత్యకిషోర్ పాల్గొన్నారు.

రూ.45 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం

అంబాపురం(విజయవాడరూరల్): మండలంలోని అంబాపురం గ్రామంలో 45 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్లు గ్రామ సర్పంచి గండికోట సీతయ్య తెలిపారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులతో 9 రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. పల్లపు ప్రాంతం కావడంతో ఎప్పుడు వర్షం కురిసినా వర్షం నీరు అక్కడకి చేరడం, చేరిన నీరు బైటకు వెళ్లే మార్గం లేక నిల్వ ఉండటంతో స్థానికులు నడవడానికి కూడా అవస్థలు పడుతున్నారని ఆయన తెలియజేశారు. కృష్ణానది నీటిని గ్రామస్తులకు తాగునీరుగా సరఫరా చేయడానికి తగిన సహాయ సహకారం అందించాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసిందని తెలిపారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ



ఉయ్యూరు: మణిపూర్ ఘటనపై ఉయ్యూరులో ఆదివారం క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో క్రైస్తవులు పెద్ద ఎత్తున ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ చేశారు. మతం ముసుగులో మారణహోమం వద్దు...మనుషులు అందరూ మానవత్వాన్ని మరవొద్దు అని నినాదాలు చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను, దమనకాండను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వాలు జోక్యం చేసుకుని శాంతి నెలకొల్పాలని కోరారు. ర్యాలీలో వివిధ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు పాల్గొన్నారు.

విద్యతో పాటు మానవత విలువలు అవసరం



విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేస్తున్న జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రసాదరాజు

ఉంగుటూరు: విద్యార్థులు చదువుతో పాటు మానవత విలువలు కలిగి ఉండాలని కాకినాడ జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన మొదటి గ్రాడ్యుయేషన్ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల కార్యదర్శి సుంకర అనీల్ మాట్లాడుతూ తమ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్‌తో పాటు ప్రతిష్టాత్మక ఐఎస్‌ఓ సర్టిఫికెట్ లభించిందని తెలిపారు. 2019లో కళాశాల అటానమస్ హోదా పొందిందని చెప్పారు. ఐబీఎంతో ఒప్పందం చేసుకుని ఐబీఎం శిక్షణతో ఉషారామ విద్యార్థులు ప్రముఖ సంస్థలలో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 320 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, డైరెక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పెనమలూరు:ఎస్టీ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని జిల్లా ఎస్టీ కమిటీ అధ్యక్షుడు బి.మోహన్‌రావు, కార్యదర్శి బి.నాగేశ్వరరావు తెలిపారు. గంగూరులో ఆలిండియా ఎస్టీ కమిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కృష్ణా జిల్లా సబ్‌కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎస్టీ ఉద్యోగులకు రోస్టర్ అమలు చేయాలన్నారు. ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఏజెన్సీలో జీవో 30 అమలు చేయాని విన్నవించారు. పార్లమెంట్ సమావేశాల్లో అటవీ సంరక్షణ చట్టాన్ని సవరణ చేసి 33 శాతం అటవీ భూములు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ నేతలు బీవీ నాయక్, ఎస్.శ్రీనివాసరావు, దీప్లానాయక్, బి.శ్రీనివాసరావు, రాముసాయక్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేతలకు అభినందన

గన్నవరంరూరల్: కృష్ణా జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-13 బాలుర చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. గన్నవరం బాలుర జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో మచిలీపట్నం సెయింట్ ఫ్రాన్సిస్, గన్నవరం సెయింట్ జాన్స్ జట్లు ఫైనల్స్‌లో తలపడగా 1-1 స్కోరుతో డ్రా అయ్యాయి. సెయింట్ ఫ్రాన్సిస్ జట్టును విజేతగా ప్రకటించారు. గన్నవరం జట్టుకు ద్వితీయ స్థానం లభించింది. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, జెడ్పీహైస్కూల్ హెచ్ఎం ఎస్.రవీంద్ర భవాని విజేతలకు షీల్డ్‌లు, మెడల్స్ అందజేశారు. అనిల్ కుమార్, సురేష్, దుర్గా ప్రసాద్, మణి మస్తాన్, నాగరాజు పాల్గొన్నారు.